# కనురెప్పలు

"జీవిత చరమాంకంలో... వార్థక్యపు పుటలపై... వెలసిపోయిన అక్షరాలపై విలవిల్లాడుతున్న మా ముసలి ప్రాణాల్ని ఏదో ఒకనాడు సాగనంపాల్సిన చెట్టంత కూతురు మా కళ్ళముందే పరమపదిస్తే... తట్టుకొని నిలబడమని శాసిస్తున్నాడా భగవంతుడు. పగవాడి క్కూడా ఈ శాపం వద్దు. ఈ శోకం వద్దు" ఉప్పెనలా ముంచుకు వస్తున్న దుఃఖాన్ని దిగమింగు కున్నాడు వయోవృద్ధుడైన రఘుపతి వెంకయ్య.

చీర కొంగుతో మాటిమాటికి కళ్ళొత్తుకుంటోంది భార్య కౌసల్యాదేవి.

కూతుర్లు, అల్లుళ్ళు విషాద చిహ్నాల్లా ఉండిపోయారు.

రఘుపతి వెంకయ్య రిటైర్డ్ ప్రభుత్వోద్యోగి. నలుగురు కూతుర్లు. ముగ్గురికి పెళ్ళిళ్ళయ్యాయి. చివరమ్మాయి ఇంజనీరింగ్ చదువుతోంది. ఆ అమ్మాయికి నిండా రెండు పదులు నిండలేదు. ఫ్రెండ్స్‌తో కలిసి నాగార్జునసాగర్‌కి ఎక్స్‌కర్షన్ వెళ్ళింది.

తిరుగు ప్రయాణంలో జరిగిందా ఘటన...

ఘోరమైన రోడ్డు ప్రమాదం ! డ్రైవర్‌తో సహా కారులోని మిగతా అమ్మాయిలు స్పాట్ డెడ్ !

కూతురు కర్మకాండ పూర్తయ్యింది.

చెమ్మగిల్లిన ఆ ఇంటి గుండె తడిమాత్రం ఇంకా ఆరలేదు.

"కొడుకు మీద మమకారం కాదు కానీ... వంశం ఆగిపోతుందనే బెంగ... ముగ్గుర

మ్మాయిల తర్వాత నాలుగవ కాన్పుపై ఆశ కల్గించింది. అది కడుపులో ఉండగా మీకీసారి మగ పిల్లవాడేనని జోస్యం చెప్పారు పండితులు. ప్రసవం అయ్యాక అడియాస అయ్యింది. మళ్ళీ ఆడపిల్ల.

అయితేనేం మగపిల్లవాడు లేని లోటు తీర్చింది. అన్ని రంగాల్లోనూ ఫస్టొచ్చేది. మా వంశంలోనే అధిక విద్యావంతురాలవుతుందనుకుంటే... ఇలా విధి వంచితురాలయ్యింది. మా కనుకొనల్లో కన్నీటి కెరటమై ఎగిసిపడుతోంది" ఆయన ఆర్తిగా తన మనోవేదనని పంచుతున్నాడందరికీ.

కర్మకి వచ్చిన మిగతా బంధువులంతా వెళ్ళిపోయారెప్పుడో.

"కూతురి స్మృతులు వీడవు. మీ దుఃఖం ఆగదు. ఇక్కడే ఎన్నాళ్ళుండి పోతామింక? కొలువులకి పెట్టిన సెలవులు కూడా పూర్తయిపోయాయి" అంటూ భార్యలతో సహా ఆ ఇంటి అల్లుళ్ళు ప్రయాణమై వెళ్ళిపోయారు తమ తమ ఊళ్ళకి.

★ ★ ★

రోజులు గడుస్తున్నాయి...

"వంట పూర్తయ్యింది. రండి వడ్డిస్తాను" నిశ్చలచిత్రంలా కుర్చీకి అతుక్కుపోయిన భర్తని పలకరించింది కౌసల్యాదేవి.

"వద్దు కౌసల్యా తిండి సయించడం లేదు" బదులిచ్చాడు విషణ్ణవదనుడై.

"ఆకలవుతోంది తినడానికేమైనా వుందా? అని అడిగితేనే కదండీ ! వంటచేశాను. ఇప్పుడేమో తినను అంటారేంటీ?" నిష్ఠూరంగా అంది.

"ఏం చేయను? ఆకలిగా ఉంటోంది. కానీ తినాలన్పించడంలేదు. మనసు మనసులో లేదు" నిర్లిప్తత వ్యక్తపరిచాడు నిస్సహాయంగా చూపులు సారిస్తూ.

"పోయినవాళ్ళకోసం విలపిస్తూ ఎన్ని రోజులుండీ ఇలా గడపడం. ముందూ వెనకా మనమూ తనువు చాలించాల్సిందేగా" వేదాంత ధోరణిలో అంది.

"నిత్యం గలగల గోదారిలా నవ్వుతూ తుళ్ళుతూ తిరుగాడేది నా చిట్టితల్లి. దాని జ్ఞాపకాల్తో ఈ ఇంట్లోనే ఉంటూ మనమిద్దరం ఒకర్నొకరం ఓదార్చుకుంటుంటే నాకు పిచ్చెక్కేలా ఉంది" నిర్వేదమయమయ్యిందతని గొంతు.

"పోనీ ఒక పనిచేద్దాం. అమ్మాయిల దగ్గరకెళ్ళిపోదామండీ. గాలి మార్పు కల్గుతుంది. కాస్త ప్రశాంతంగా ఉంటుంది" సూచించింది భర్తకి.

నిజమేనన్పించింది.

భార్య సలహా ఆలోచింపచేసిందతన్ని.

కొడుకులైనా వాళ్ళే... కూతుర్లైనా వాళ్ళే ! తమకా వార్ధక్యం. శేష జీవితంలో ఎవరో ఒకరి పంచన గడపాల్సిందే. దానికిపుడే నాంది పలికితే బావుంటుంది అనుకుని ఒక స్థిర నిశ్చయానికి వచ్చాడు.

"అలాగే కౌసల్యా ! ఉగాది పండుగవస్తోంది మనింటపండగ లేదని ప్రతి కూతురు మనల్ని రమ్మని ఆహ్వానిస్తుంది. ఒకరింటికి వెళ్ళితే మరొకరి మనసు చివుక్కుమంటుంది. అందుకని ఎప్పటిలా మనమే అందర్నీ ఇక్కడికే రమ్మందాం. మనం చుట్టపుచూపుగా వెళ్ళడం కాకుండా... మనిద్దర్నీ ఎవరు శాశ్వతంగా తమ దగ్గర వుంచుకుంటారో వాళ్ళ అభిప్రాయం తెలుసుకుందాం" తన మనసులోని మాట భార్యకి చెప్పాడు.

'సరే' అన్నట్లు తలూపిందామె.

"పండక్కి రమ్మని" అందరికీ మెసేజ్ అందించాడు రఘుపతి వెంకయ్య.

★ ★ ★

పిల్లా పాపల్తో అందరూ వచ్చిచేరారు. ఇల్లు మునుపటిలా కళకళ లాడుతుంటే కౌసల్యాదేవి వదనం వికసించింది. ఆయన ఒంటరితనమూ పోయింది.

"పండక్కి మిమ్మల్నే అక్కడికి పిలుద్దామనుకొన్నాం. అత్తయ్య కూడా చెప్పింది... మీ అమ్మా నాన్నల్ని పండక్కి పిలవ్వే అని" పెద్దకూతురు సుమిత్ర అంది.

"మీరంతా వచ్చింది పండక్కే అయినా నేను ఆహ్వానించిన కారణం మరొకటుంది" అన్నాడు రఘుపతి వెంకయ్య విషయం మొదటే ప్రస్తావించకుండా.

అందరి ముఖాల్లో ఆసక్తి రేకెత్తడం క్రీగంటితో గమనించాడాయన.

"చిన్నమ్మాయి చదువు పూర్తవగానే తగిన వరుడ్ని వెతికి పెళ్ళి చేసి మాకు తోడుగా ఉండిపొమ్మందామనుకున్నాం. కానీ విధి వెక్కిరించింది. మా ముసలి వాళ్ళిద్దర్నీ ఎవరో ఒకరు సాకాలి కదా ! ఇప్పుడా బాధ్యత మీ ముగ్గురిపై పడింది. తప్పదు. కొడుకుంటే ఈ సమస్యే వచ్చేది కాదు. కళ్ళకి కనురెప్పలు, వృద్ధాప్యానికి వారసుల అండ ఉండాల్సిందే !" తండ్రి అంతరంగం అందరికీ అవగతమైంది.

ఏ జంట కాజంట ఆలోచనల్లో పడ్డారు.

టైమివ్వండని అడిగారు.

"ఏదిచ్చినా తీసుకోవడానికి ఆలస్యం చేయనివాళ్ళు, ఆపదవేళ అర్థిస్తే ఆదుకోవడానికి ఇంత ఆలోచనెందుకో?" రఘుపతి వెంకయ్య మనసులో ప్రశ్నించుకున్నాడు.

తిరిగి సాయంత్రం ఒక్క చోట చేరారంత.

"బాబూ చంద్రం, ఈ ఇంటికి పెద్దల్లుడివి. ముందు నీ మనోగతమేంటో చెప్పు" అన్నాడు వెంకయ్య.

"నాకూ తల్లిదండ్రులున్నారు. వాళ్ళని కూడా వృద్ధాప్యం చుట్టేసింది. కొడుగ్గా వాళ్ళని ఆదరించాల్సిన బాధ్యత నాపైన ఉంది. అలాంటప్పుడు మీకు ఆలంబనగా నిలవాలంటే కష్టసాధ్యం. మీకుండాలని అన్పించినప్పుడు ఓ వారమో, నెలో వచ్చి మా ఇంట ఉంటానంటే మాత్రం అభ్యంతరం లేదు" నిర్మొహమాటంగా తన అభిప్రాయం వెల్లడించాడు చంద్రం.

"స్వంత అక్కకొడుకు. పైగా ముగ్గురన్నదమ్ములు. అన్నా, తమ్ముడే తల్లిదండ్రుల

అవసరాల్ని భుజాల మీద వేసుకున్నారు. ఇలా తల్లిదండ్రుల్నే పట్టించుకోని ఈ అల్లుడు... మేనల్లుడు అత్తా మామల్ని అక్కున చేర్చుకుంటాడా... వట్టి భ్రమ !" పెదవి విరిచాడు రఘుపతి వెంకయ్య.

"నీవేమంటావమ్మా!" పెద్దకూతుర్నడిగాడు.

ఆమె మొగుడి మాట వినదు. అసలెవరి మాటా ఖాతరుచేయదు. రెపెప్పుడైనా 'మీరు నన్ను మాటవరసకైనా అడిగారా నాన్నా?' అని అంటుందేమోనని ఆమెని కదిపాడు.

"మీకు ముగ్గురు కూతుళ్ళము. అందరూ ఒప్పుకుంటే తలా నాలుగు నెలలు మిమ్మల్ని పంచుకుంటాం" అందామె ఎంతో ఔదార్యంతో.

ఒక మంచు అల గుండెని ఢీకొన్నట్లు... బిగుసుకుపోయింది కౌసల్యాదేవి.

'తల్లిదండ్రుల బాధ్యతను స్వీకరించాల్సింది ఇంటికి పెద్దకొడుకని హిందూ ధర్మశాస్త్రాలు వెల్లడిస్తున్నాయి. కొడుకూ కూతురు ఒకటే అనుకున్నప్పుడు... కనీసం తన పెద్దకూతురు మాటవరసకైనా మిమ్మల్ని పోషించడానికి నేనొక్కదాన్ని చాలదూ ! అని పెద్దమనసుతో అన్లేకపోయింది' సాలోచనగా తల పంకించాడు వెంకయ్య.

"నువ్వేమంటావయ్యా గోపీ!" రెండో అల్లుడి వంక చూపు మరల్చాడాయన.

గోపి పెదవి విప్పాడు.

"ఇద్దరు ఒకే చోట ఉంటే ప్రాబ్లమే! అనేకానేక ఇబ్బందులు. అవన్నీ ఎందుగ్గానీ... మీలో ఎవరైనా ఒక్కరు మా చెంతనుంటానంటే మాకెలాంటి అభ్యంతరం లేదు" స్పష్టం చేశాడు.

అది విని చివాల్న రెండవ కూతురు వంక చూశాడు.

"ఆయనెలా అంటే అలా నాన్నా!" అందామె.

"మేమిద్దరం విడిపోయి... ఒక్కొక్కరమై, ఒంటరిగా దిక్కులేనివాళ్ళగా బ్రతకాలా ? ప్రేమించి పెళ్ళిచేసుకున్నవాళ్ళు అనాల్సిన మాటలేనా ఇవి?"

మేమిద్దరం ప్రేమించుకున్నాం. మీ అమ్మాయిలేనిదే బ్రతకలేను. అని వచ్చి అడిగితే భవిష్యత్ బాగుండాలని కోరకుండానే కట్నమిచ్చి, పెళ్ళి చేశాను. అలాంటి దీవేళ... ప్రేమికులైన ఈ జంట... వృద్ధ దంపతుల్ని విడగొట్టి పంచుకునే ఆలోచన... మనసు దిటవు చేసుకున్నాడు.

తన కన్నపేగులే గుండెని మెలిపెడుతున్నా చలించలేదు.

"వాళ్ళిద్దరి ఆలోచనలవి. నీమనసులో కూడా ఏముందో చెప్పు మోహన్" మూడవ అల్లుడ్ని యధాలాపంగా అడిగాడు రఘుపతి వెంకయ్య.

మోహన్ వెంటనే రియాక్టవలేదు.

క్షణాల మీద నిశ్శబ్దం ఆవరించిందక్కడ.

"నాకు మరింత సమయం కావాలి మామయ్యా! వాస్తవానికి మేము ఇంటికి అల్లుళ్ళం.

కాని మమ్మల్ని మీరు స్వంత కొడుకుల్లా ఆదరిస్తున్నారు. మేమిప్పుడు కొడుకులమై మీ అవసాన దశలో ఆదుకోవాలి. సాధ్యాసాధ్యాలు ఆలోచించాలి. అందుకే గడువడుగుతున్నాను" కోరాడు మోహన్.

మోహన్ భార్య సౌజన్యకి భర్త ఆంతర్యం బోధపళ్ళేదు.

'కన్నకొడుకులే ముసలి తల్లిదండ్రుల పట్ల కాఠిన్యం వహిస్తుంటే... ఆడపిల్లలు... వీళ్ళనుండి ఆశించి ఏం లాభం ?' నిట్టూర్పు విడిచింది కౌసల్యాదేవి.

పైకి మాత్రం...

"ఏదెలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుంది. మనం కోరుకున్నది కోరుకున్నట్లే జరగాలనేం లేదు. ముందు భోజనాలయితే కానివ్వండి" అంటూ అందర్నీ భోజనాలకి లేవదీసిందామె.

★ ★ ★

"మీరిద్దరూ మా యింట ఆదిదంపతులై కొలువుంటానంటే నాకంతకంటే కావాల్సిందేమీ లేదు. ఏనాటికైనా మిమ్మల్ని నేనీకోరిక కోరాలనుకున్నాను. కానీ ఆ దైవమే ఈనాడు మీ నోట పలికించింది. మా చెంత ఉంటానంటే సంతోషం మామయ్యా! మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూచుకుంటాం" మోహన్ భావోద్వేగాలు చూసి అచ్చెరువొందారా వృద్ధ దంపతులు.

"నెల నెలా నాన్నకి పెన్షన్ వస్తుంది కదా ! పువ్వుల్లోపెట్టి మువ్వెందుకు చూసుకోవూ?" మరిది మాటలకి రుసరుసలాడింది రెండవ వదిన.

"నువ్వు, నీ భార్య ఇద్దరూ ఉద్యోగానికి వెళ్ళిపోతారు. వంటవార్చడానికి, పిల్లల్ని ఇంట్లో కనిపెట్టుకొని ఉండడానికి... దిక్కెవరైనా ఉండాలిగా. అందుకు అమ్మా నాన్నలిద్దరూ చక్కగా సరిపోతారు. సాయపడతారు. పనివాళ్ళని పెట్టుకుంటే మటుకు స్వంత మనుషుల్లా కాపలా కాస్తారా ఏం?" అక్కసుగా అంది పెద్దవదిన సుమిత్ర.

వదినలిద్దరి దెప్పిపొడుపులకి సమాధానమిచ్చాడు నెమ్మదిగా.

"నా చిన్నతనంలోనే అమ్మా నాన్నల్ని కోల్పోయాను. మేనమామల పెంపకంలో పెరిగి ప్రయోజకుడినయ్యాను. ఏలోటు తెలియకుండా నన్నింతవాడిని చేసారు వాళ్ళు. అందుకు ఆ మామయ్యలకి చాలా రుణపడి ఉన్నాను. కానీ తల్లిదండ్రులు లేని లోటు ఎవరూ తీర్చలేనిది. పెళ్ళయ్యింది. మీ ఇంట అల్లుడిగా అడుగు పెట్టాను. మీ ఆప్యాయానురాగాల్ని అందుకున్నాను. నిత్యం మీలో నా తల్లిదండ్రుల్ని చూచుకుంటున్నాను" అంటూ అత్తామామలవైపు చుశాడు.

"ఏమ్మా ! నువ్వు మౌనంగా ఉండిపోయావేంటీ?" మోహన్ భార్య అయిన తన మూడవ కూతురు సౌజన్యని లాలనగా అడిగాడు రఘుపతి.

"మౌనం కాదు నాన్నా... మహదానందం. మీకు సేవచేసే భాగ్యం మాకు కల్గిస్తానంటే

అంతకంటే అదృష్టం మరేముంది" అందామె స్వచ్ఛమైన మనసుతో.

కూతురు, అల్లుడి మంచి మనసుకి భార్యాభర్తల హృదయాల్లో హరివిల్లులు ఆవిష్కృతమయ్యాయి.

"నీకు మా మీదున్న ఆప్యాయతకి నిజంగా అదృష్టవంతులమన్పిస్తోంది. నాకు కొడుకున్నా మమ్మల్నింతగా ఆనందింపజేసేవాడు కాదేమో! ఏదిఏమైనా నీ మంచిమనసు నొప్పించకుండా ఉండడానికైనా సమయం వచ్చినప్పుడు మీ ఇంట ఉంటాం అది ఖాయం.

కానీ ఇప్పుడు-

ఎవరెలాంటివారో, ఎవరి లోపల ఏముందో తెలుసుకోవాలని ఓ చిన్న నాటకం ఆడాను. ఎప్పటిలా వెలితికుండలు అపశృతిని పలికాయి. నిండుకుండలు మాత్రం సప్తస్వరాలు చిలికాయి" అన్నాడు రఘుపతి వెంకయ్య.

ఒక కడలి కెరటం నిలువునా చీలినట్టు...

'నా..ట..క..మా?' తుళ్ళిపడ్డారంతా.

"పిచ్చితల్లి పేర కట్టిన ఇన్సూరెన్స్ మనీ నాలుగు లక్షలు వచ్చింది. అది నాకూతురి డబ్బు. న్యాయంగా ఆ డబ్బు ఎవరికి చెందాలా అని తీవ్రంగా ఆలోచించాను. నా పెన్షన్ డబ్బు... ఈ ఇల్లు... నాముగ్గురి కూతుళ్ళకి చెందుతాయి మా తదనంతరం. అదెవరూ కాదనలేరు. అది మీ హక్కు. మరి మా ముసలివాళ్ళ బాధ్యత ఎవరు నెత్తిన వేసుకుంటారా... నిస్వార్థంగా ఎవరు మమ్మల్ని చేరదీస్తారా...అనే ఆసక్తి కల్గింది.

చిన్న టెస్ట్ పెట్టాను. విజేత ఎవరో వెల్లడయ్యింది.

మోహన్ నిజాయితీ నచ్చింది. అందుకే ఆ నాలుగు లక్షలు మాత్రం అతనికే అప్పచెప్పాలని నిశ్చయించాను. నేడు కాకపోయిన రేపైనా ఆ డబ్బు విషయం బయటపడుతుంది. అందుకే దాచాలన్పించలేదు. ముందు జాగ్రత్తగా నేనే నిర్ణయం తీసుకుంటున్నాను.నాకు తెలిసి ఇదే ధర్మనిర్ణయం" ప్రకటించాడు రఘుపతి వెంకయ్య అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తుతూ.

ఆయన నిర్ణయాన్ని ఎవరూ వ్యతిరేకించలేదు. బదులిచ్చే సాహసం చేయలేదు.

కానీ మోహన్ పెదవి విప్పాడు.

"అత్తామామలకి మాయమాటలు చెప్పి బుట్టలో వేసుకొని డబ్బు వశపరుచుకున్నాడని లోకం కోడైకూయొచ్చు. ఆ అపవాదు నాకొద్దు.

మీ నుండి చిల్లిగవ్వ ఆశించకుండా నేను మీ బాధ్యత స్వీకరించదలచాను. అది వాస్తవం. అయితే ఇందులో నా స్వార్థం కూడా ఉంది." అంటూ ఆగాడు.

అత్రుతగా చూసారందరూ మోహన్ వంక.

తిరిగి కొనసాగించాడతను.

"ఎటువైపునుండి కూడా అమ్మమ్మా-నాన్నమ్మా-తాతయ్యలు లేకుండా నా బాల్యం గడిచిపోయింది. వాళ్ళని నేను మిస్సయినా నా పిల్లలు కోల్పోకూడదు. అదే నా తాపత్రయం.

మీ తరం ఆ మూడోతరానికి అందించే కబుర్లెన్నో ఉంటాయి. అందుకు వాళ్ళకి మీ తోడు అవసరం. మానవ విలువలు కరువై, యాంత్రిక జీవనమే జీవితమవుతున్న తరుణంలో... పిల్లలకి మీ ఆలంబన కావాలి. మీరందించే క్రమశిక్షణ అలవడాలి. రిటైర్డ్ ఉపాధ్యాయుడిగా మీ శిక్షణలో వాళ్ళు పరిమళించాలి. నిత్యం మీ అప్యాయత, ఆశీస్సులు వాళ్ళకి అందాలి. అందుకే మీ దంపతులిద్దరూ ముచ్చటగా మా ఇంట ఉండాలి. కనురెప్పలమై మీకు అండగా మేముంటాం"

అల్లుడే కొడుకై సరికొత్త అధ్యాయాన్ని గుండెపుటల మీద అవిష్కరిస్తున్న తరుణం.

"మామా అల్లుడికి మధ్యఉన్న సరిహద్దుల్ని చెడిపేశావు. అల్లుడంటే దశమ గ్రహం కాదని కొడుకై అనుగ్రహిస్తాడని... సరికొత్త నిర్వచనానికి ఊపిరి పోస్తూ... మా గుండె శిఖరం మీద మహోన్నతమై నిలిచావు." రఘుపతి వెంకయ్య మనసులో ఆనందం ఉత్తుంగతరంగమై ఎగిసింది.

ధర్మపత్ని వంక ప్రసన్నంగా చూసాడు. వాడిన ఆమె పెదవులపై చిరునగవు పూసింది.